
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్


RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 336 ఎడిటర్: కె.యువరాజ్ మంగళవారం 15-9-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు





## వాహనదారులకు అలర్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (వన్‌నేషన్):** ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈఏడాది 69 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ గణేశుడిని తీర్చిదిద్దారు. ఈరోజు(సోమవారం) ఉదయం మహా గణపతికి తొలిపూజ నిర్వహించనున్నారు. తొలిపూజలో గవర్నర్ శివప్రసాప్ శుక్లా పాల్గొననున్నారు. ఇక గణేశ్ ఉత్సవాల సందర్భంగా నేటి(సోమవారం) నుంచి సెప్టెంబర్ 24 వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు రద్దీకి అనుగుణంగా పలు మార్గాల్లో వాహనాలను మళ్లించనున్నారు.

వీవీ విగ్రహం వైపు వచ్చే వాహనాలు నిరంకారి జంక్షన్ వైపు, పాత పీఎస్ సైఫాబాద్ వాహనాలు ఇక్బాల్ మినార్ వైపు వాహనాలను మళ్లించనున్నారు. నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు ట్రాఫిక్‌కు అనుమతిని నిరాకరించారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఖైరతాబాద్, సైఫాబాద్, మింట్ కాంపౌండ్, చీ= మార్గ్, సెక్రటేరియట్ జంక్షన్, మాసాబ్ ట్యాంక్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉండటంతో... వాహనదారులు ఇతర మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. భక్తుల కోసం రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ పక్కన ఎవీణూ పార్కింగ్, విశ్వేశ్వరయ్య భవన్‌లలో ప్రత్యేక పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారు.

# ఐక్యంగా ఉంటేనే మీకు కోటా.. వాటా..

### రేవంత్ - ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన - సీఎం మాటల్లోనే కఠినత్వం.. - చేతల్లోనూ ఉంటే ఎంతో మంది జైలుకెళ్లేవారు: టీజీ వెంకటేశ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (వన్‌నేషన్):** ఆర్యవైశ్యులంతా సమైక్యంగా ఉండాలని, పోటీ ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని సీఎం రేవంత్ అన్నారు. సమయస్ఫూర్తితో రాజకీయాల్లో కోటా, వాటా దక్కించుకోవాలని సూచించారు. అందరూ ఒక్కతాటిపై నడిస్తే

2లో




### బ్రిక్స్ సదస్సు ద్వారా ప్రపంచ వేదికపై భారత్ సత్తా చాటింది

### సీఎం చంద్రబాబు నాయుడు..

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (వన్‌నేషన్):** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు-18పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసలు కురిపించారు. ఈ సమావేశాన్ని భారత్ విజయవంతంగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ సదస్సు ద్వారా ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థలు ఒకే వేదికపైకి వచ్చాయని సీఎం పేర్కొన్నారు. ప్రపంచం కీలక మార్పులను ఎదుర్కొంటున్న సమయంలో సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుందని తెలిపారు. బ్రిక్స్ సదస్సులో భాగంగా న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడంపైనా ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. బహుళపక్ష సంస్థలను మరింత బలోపేతం చేయడం, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేయడం, ఆవిష్కరణలు, సుస్థిరాభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని స్వాగతించారు. రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేసే కీలక అంశాలుగా వీటిని అభివర్ణించారు. విభిన్న అభిప్రాయాలు కలిగిన దేశాలు ఒకే వేదికపైకి వచ్చి నిర్మాణాత్మకంగా చర్చించుకునేందుకు,

3లో




# కథల నిధి మన కరీంనగరం

## 'కరీంనగర్ జిల్లా కథలు' కథగా రాసుకున్న ఒక నేల చరిత్ర

**సమీక్ష : డా పెరుక రాజు**




**కొన్ని పుస్తకాలు కథలను చెబుతాయి.**
**కొన్ని కాలాన్ని నమోదు చేస్తాయి.**
**అరుదుగా కొన్ని ఒక నేల తన గురించి తానే చెప్పుకున్న ఆత్మకథగా నిలుస్తాయి.**
**'కరీంనగర్ జిల్లా కథలు' అటువంటి అరుదైన కథా సంకలనం.**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటేనే కథకు సారవంతమైన నేల. ఇక్కడ కథ కేవలం కల్పన నుంచి పుట్టలేదు; మట్టి వాసన నుంచి, చెమట చుక్క నుంచి, ఆకలి మంట నుంచి, ఉద్యమ నినాదం నుంచి, మనిషి అంతరంగపు సంఘర్షణ నుంచి పుట్టింది. పొలం గట్టు నుంచి పరిశ్రమ దాకా, పల్లె బాట నుంచి పట్టణ జీవితం దాకా, కుటుంబ సంబంధాల నుంచి సామాజిక వైరుధ్యాల దాకా ఈ ప్రాంతపు జీవితం కథకు ఎప్పటికప్పుడు కొత్త రక్తాన్ని అందించింది.

అందుకే కరీంనగర్ కథను చదవడం అంటే ఒక ప్రాంతాన్ని భౌగోళిక పటంలో చూడటం కాదు; కాలం మనిషిపై రాసిన గాయాలను అక్షరాల్లో చదవడం.

రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, సిరిసిల్ల ప్రచురించిన ఈ బృహత్ సంకలనం 63 మంది రచయితల కథలను 623 పుటల్లో ఒకే సాహిత్య వేదికపై నిలిపింది. రూ.650 ధరతో వెలువడిన ఈ గ్రంథానికి తోట వైకుంఠం రూపొందించిన ముఖచిత్రం తెలంగాణ జీవన స్వభావానికి కళాత్మక ప్రవేశద్వారంలా నిలుస్తుంది.

ఈ సంకలనం వెనుక ఒక స్ఫూర్తిదాయకమైన చరిత్ర ఉంది. కరీంనగర్ జిల్లా కథలను ఒక గ్రంథంగా తీసుకురావాల్సిన అవసరాన్ని మాజీ మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు ఒక సాహిత్య సమావేశంలో సూచించగా, ఆ ఆలోచనకు రంగినేని ట్రస్ట్ కార్యరూపం ఇచ్చింది. అప్పుడు పడిన విత్తనం కాలంతో మొలకెత్తి, నేడు అరవైమూడు కథల సాహిత్య వృక్షంగా పాఠకుల చేతుల్లో నిలవడం విశేషం.

భారత మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు పి.వి. నరసింహారావు 'గొల్ల రామవ్వ' ఈ సంకలనానికి చారిత్రక గాంభీర్యాన్ని చేకూరుస్తుంది. చెన్నమనేని విద్యాసాగర్ రావు 'అవార్జి', నలిమెల భాస్కర్ 'మంద', అల్లం రాజయ్య 'అతడు', బి.ఎస్. రాములు 'బతుకు పయనం', సంగెవేని రవీంద్ర 'ప్రేమ', పెద్దింటి అశోక్ కుమార్ 'గుండెలో వాన' వంటి కథలు విభిన్న జీవన పార్శ్వాలను స్పృశిస్తాయి. జీవితంలోని ఎన్నో కష్టాలను, కన్నీళ్లను దగ్గరగా చూసిన సైనికుడు పెరుక రాజు కలం నుంచి వచ్చిన 'కన్నీళ్లు' కథ, జీవితపు కఠిన వాస్తవాలను మానవీయ కోణంలో ఆవిష్కరిస్తూ హృదయాన్ని తడిపి, ఆలోచనను మేల్కొలుపుతుంది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే అరవైమూడు మంది కథకుల సృజనాత్మక వైశిష్ట్యాన్ని కొన్ని పేర్లలో కుదించడం ఈ సంకలన విస్తృతికి న్యాయం చేయదు.

ఇవి 63 కథలు మాత్రమే కావు సమాజాన్ని చూసిన 63 కిటికీలు.

ఒక కిటికీలో రైతు చెమట కనిపిస్తుంది మరొకదానిలో బతుకు పోరాటం. ఒక కథలో కన్నీరు నిశ్శబ్దంగా జారితే, ఇంకొక కథలో అదే కన్నీరు ప్రశ్నగా నిలబడుతుంది. ఎక్కడో ప్రేమ మనిషిని కలుపుతుంది ఎక్కడో అసమానత విడదీస్తుంది మరెక్కడో మట్టి, జ్ఞాపకం, ఆత్మగౌరవం, తిరుగుబాటు కథకు అంతర్వాహినులవుతాయి. భాషలో తెలంగాణ నుడికారం, వస్తువులో స్థానిక జీవితం ఉన్నప్పటికీ, వాటి అంతరాత్మ మాత్రం విశ్వమానవీయమైనది. తొలితరం మలితరం కథకులను ఒకే చోటకు తీసుకురావడం ఈ గ్రంథం సాధించిన మరో ముఖ్యమైన పని. అన్ని కథలను చేర్చలేకపోయామని, ఆర్థిక పరిమితులు, కథల లభ్యత తదితర కారణాలతో ఈ ప్రయత్నం ఇంకా అసంపూర్ణమేనని సంపాదకులు పేర్కొనడం వారి సాహిత్య నిజాయితీకి నిదర్శనం. నిజానికి ఈ 'అసంపూర్ణతే' మరో సంపుటికి ఆహ్వానం. ఎందుకంటే ఒక ప్రాంతపు కథాచరిత్రను ఏ ఒక్క పుస్తకమూ పూర్తిగా బంధించలేదు. ప్రాంతీయ సాహిత్యం ప్రాంతానికి పరిమితమైనది కాదు. వేరు ఎంత లోతుగా తన నేలలోకి వెళ్తే, చెట్టు అంత విశాలంగా ఆకాశాన్ని తాకుతుంది. అలాగే స్థానిక జీవితాన్ని ఎంత నిజాయితీగా కథ చెబితే, అది అంత విశ్వజనీనంగా మారుతుంది. ఈ సంకలనంలోని ఆకలి, ప్రేమ, దుఃఖం, శ్రమ, అన్యాయం, ఆత్మగౌరవం, ప్రతిఘటన అన్నీ చివరకు మనిషివే. అందుకే 623 పుటల ఈ గ్రంథం కేవలం పెద్ద పుస్తకం కాదు ఒక జిల్లా నడిచివచ్చిన కాలపు అడుగుజాడల భాండాగారం. పరిశోధకుడికి ఆధారం, కొత్త కథకుడికి పాఠశాల, సాహిత్యాభిమానికీ అనుభవం, రాబోయే తరాలకు కథారూపంలో అందించిన సామాజిక జ్ఞాపకం. తెలుగు కథను ప్రేమించే ప్రతి పాఠకుడి గ్రంథాలయంలో నిలవదగిన కథల నిధి మన కరీంనగరం. ఒక్క మాటలో ఇది 63 కథల సంకలనం కాదు. 63 కలాలు కలిసి రాసిన ఒక నేల సామూహిక ఆత్మకథ.

డా పెరుక రాజు
బహుభాషావేత్త & విమర్శకుడు
7810032847

## జిఎస్ఐ డివిజన్ లోని శ్రీనివాస్ నగర్ కాలనీ (విశాలాంధ్ర) రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# వినాయక చవితి వేడుకలు



**జిఎస్ఐ/వన్ నేషన్:** జిఎస్ఐ డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ విశాలాంధ్ర కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఎంతో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుండి ఇక్కడ వినాయక చవితి వేడుకలు ఎంతో ఐక్యమత్యంతో , కుటుంబ సభ్యులాగా ఘనంగా నిర్వహించుకుంటామని అన్నారు. ఇందులో భాగంగా పూజా కార్యక్రమాలు, సంస్కృతిక కార్యక్రమాలు, తంబోలా ,అన్నదాన కార్యక్రమాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. 12వ రోజు 25వ తేదీన అన్నదాన కార్యక్రమం, లడ్డు వేలం పాట, శోభాయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హానరబుల్ ప్రెసిడెంట్ తిప్పర్తి యాదయ్య , ప్రెసిడెంట్ థామస్ చౌదరి , వైస్ ప్రెసిడెంట్ సంజీవ , సూర్యనారాయణ, జనరల్ సెక్రెటరీ జనార్దన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రామచందర్, అడిషనల్ సెక్రటరీ కల్పన, ట్రెజరర్ రాజా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అశోక్ రెడ్డి, సాయి కమల, నరసింహ రాజు ఆర్.శ్రీనివాస్ మహిళలు , పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కళాకారుల బతుకులతో ఆటలాడుతున్న... ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం....

**- సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి హామీలను నిలబెట్టుకో**
**- డిమాండ్ చేస్తున్న తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జవ్వాజి ప్రవీణ్ కుమార్**




**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (వన్‌నేషన్):** శాసన సభలో కళాకారుల పై కపట ప్రేమను చూపుతూ మాట్లాడిన సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు – తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జవ్వాజి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సాంస్కృతిక సారధిలో ఉద్యోగాల కోసం మేనిఫెస్టోలో పెట్టిన జీవోను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేస్తున్న తెలంగాణ ఉద్యమ & నిరుద్యోగ కళాకారుల సంఘం.త్వరలోనే రాష్ట్ర కమిటీ నాయకులతో చర్చలు జరపాలని. సీఎం రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేస్తున్నాం.

లేకపోతే 33 జిల్లాల కళాకారులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ఆయన అన్నారు.

హలో కళాకారుడా చలో రవీంద్ర భారతి ముట్టడిస్తామని హెచ్చరిస్తూ. డిమాండ్ చేశారు. కాలయాపన వద్దు కళాకారుల ఉద్యోగాలు ముద్దు. తెలంగాణ ఉద్యమంలో గోసి గొంగడి వేసి ఊరు ఊరు తిరిగి పోరుపాటలతో తెలంగాణ ధూంధాం చేసి మా జీవితాలను త్యాగం చేసినటువంటి కళాకారులను ఆనాడు ఆట పాట ద్వారా తెలంగాణ రాష్ట్రంలో తమదైన ముద్ర వేసిన పాత్ర కళాకారులది... అని అన్నారు.

కానీ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం 550 మందికి ఉద్యోగాలు సాంస్కృతిక సారధిలో ఇచ్చి చేతులు దులుపుకున్నారు... అసలైన అర్హులైన నిజమైన కళాకారులకు తీరని అన్యాయం జరిగింది. అని తెలిపారు అదేవిధంగా సాంస్కృతిక సారధి పే కూడా కేసులు వేయడం కూడా జరిగింది.

అయినా కూడా ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు కళాకారులకు మొండి చేయి చూపించింది. పోనీ ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజులలోనే మీకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఆ తర్వాత ప్రభుత్వం గుర్తించి కళాకారులను ఆదుకుంటామని వెయ్యి ఉద్యోగాలు ఇస్తామని కూడా మాట ఇవ్వడం జరిగింది గాంధీభవన్ల లో మేనిఫెస్టోలో కూడా పెట్టినారు ఆనాటి పిసిసి అధ్యక్షులు ఈనాటి ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ రేవంత్ రెడ్డి గారు హామీ ఇవ్వడం జరిగింది. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పాటై రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న.. కూడా ఎంతోమంది ఎమ్మెల్యేలను మంత్రులను అధికారు లను కలిసిన లాభం లేకుండా పోయింది... ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి అర్హులైన కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారధిలో 1000 ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని హెచ్చరిస్తూ డిమాండ్ చేస్తున్నాం.

నిన్న జరిగిన శాసనసభలో సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు గారు మాట్లాడుతూ కళాకారులను ఆదుకుంటామని కాలయాపన మాటలు చెపుతున్నాడు తప్ప కళాకారుల బతుకుల లో వెలుగులు నింపాలని ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని చిత్తశుద్ధి లేదని తేట తేలమైంది కాబట్టి కళాకారులందరూ ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడడానికి కూడా సిద్ధమవలసినటువంటి అవశ్యకత వస్తుంది.

కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు, వెంటనే రాష్ట్ర కమిటీ నాయకులతో చర్చలు జరిపించి వెనువెంటనే ఉద్యోగాల ప్రక్రియ వేగవంతం చేస్తూ నోటిఫికేషన్ జారీ చేస్తూ ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తున్నాం.

లేదంటే పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో అన్ని జిల్లాలోని కళాకారులను కలుపుకొని చలో రవీంద్ర భారతి నీ కూడా ముట్టడిస్తామని హెచ్చరిస్తూ డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమంలో

ప్రాణ త్యాగాలను సైతం లెక్కచేయకుండా సిద్ధమై ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ఆట పాట పాడిన కళాకారులం. ఆనాటి తెలంగాణ ఉద్యమాన్ని ఊపిరిగా నమ్ముకుని బతికినటువంటి కళాకారులకు మీరు మోసం చేసే దిశగా అడుగులు వేస్తే మాత్రం చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదు కాంగ్రెస్ ప్రభుత్వానికి పాడే కట్టేంతవరకు పాటతోనే మీకు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరిస్తూ డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి గారు బట్టి విక్రమార్క గారు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు వెంటనే చర్యలు తీసుకోకపోతే మీ ప్రభుత్వానికి మీకు తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ర్యాలీలు, రాస్తారోకోలు, చేపడతామని అని హెచ్చరిస్తూ డిమాండ్ చేశారు...

# ఐక్యంగా ఉంటేనే మీకు కోటా.. వాటా..

(1వ పేజీ తరువాయి)

వారిని గౌరవించనివారు ఉండరని పేర్కొన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, 'ఆర్యవైశ్యుల్లో చాలా మంది పేదలు ఉంటారు. కానీ, వారు తమ పేదరికాన్ని కడుపులో దాచుకొని.. సమాజంలో గౌరవం, ఆత్మాభిమానంతో బతుకుతారు. సౌమ్యంగా ఉంటారు' అని అన్నారు. బ్యాంకులు, ఇతర సంస్థలు ఏదైనా ఆస్తిని తనఖా పెట్టనిదే రుణం ఇవ్వవని, కానీ.. ఊరిలో ఉన్న ఏ పేదవాడు వచ్చినా తినడానికి అవసరమైన వస్తువులను ఆర్యవైశ్యులు ఉదారంగా ఇస్తారని తెలిపారు. ఏ గ్రామమైనా, బస్తీ అయినా ప్రశాంతంగా ఉందన్నా, పేదవాడి ఆకలి తీరుతుందన్నా.. ఎలాంటి తనఖా లేకుండా ఆర్యవైశ్యులు అప్పులు ఇవ్వడం వల్లేనన్నారు. "పేదవాడి ఆకలి తీర్చడాన్ని మీరు బాధ్యతగా భావిస్తారు. పేదలతో మీకు ప్రత్యేక అనుబంధం ఉంటుంది. ఊరిలో అందరూ మీ వద్దకు వచ్చి సాధక బాధకాలు చెబుతారు. మీ సలహా కూడా అడుగుతారు. వ్యాపారంలో ఎన్ని ఒడిదొడుకులు, ఆటుపోట్లు ఎదురైనా ఎలా అధిగమించాలో ఆర్యవైశ్యులకు తెలుసు. నేనెప్పుడూ మీ శ్రేయోభిలాషినే" అని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు గల్లాపెట్టె పెత్తనం వారికే ఇచ్చారని చెప్పారు. తమ సొమ్ము కంటే జాగ్రత్తగా, పొదుపుగా వ్యవహరించడంతోపాటు.. ఆర్థిక వ్యవస్థను అదుపులో పెట్టి అద్భుతంగా పదవులు నిర్వర్తించారని తెలిపారు.

# శ్రీరామ్ గ్రూప్ 1974లో గౌరవనీయులైన శ్రీ రామమూర్తి త్యాగరాజన్ ఆధ్వర్యంలో ప్రారంభం

**- నేడు దేశవ్యాప్తంగా 3500కు పైగా బ్రాంచీలు , 90000 పైగా ఉద్యోగులు, 1 కోటి మంది కస్టమర్‌లు, 3.17 లక్షల కోట్లఖాతావీ కలిగి ఉంది. - శ్రీ రామమూర్తి త్యాగరాజన్ గారిని భారత ప్రభుత్వం 2013లో పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది.**



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (వన్‌నేషన్): రవాణా రంగంలోని చిన్న, సన్నకారు వాహన యజమానులకు రుణ సౌకర్యం లక్ష్యంతో శ్రీరామ్ ఫైనాన్స్ ప్రారంభమైంది. శ్రీ ఉమేష్ జి రేవంకర్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, శ్రీ పరాగ్ శర్మ, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ సుదర్శన్ బి హటరీల్లా, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మరియూ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సారథ్యంలో ముఖ్యంగా ట్రక్ డ్రైవర్లను వాహన యజమానులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోంది.

టూ వీలర్లు, త్రీ వీలర్లు, కమర్షియల్ వాహనాలు,



ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, మెషినరీలు, కార్లు, బంగారు రుణాలు తదితరాలకు కొనుగోలు మరియు రీఫైనాన్స్ ద్వారా రుణ సౌకర్యం లక్ష్యంతో శ్రీ రామ్ ఫైనాన్స్ అందిస్తోంది.

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 35 బ్రాంచీలతో రవాణా రంగానికి సేవలందిస్తోంది. రవాణా రంగంలో పనిచేస్తున్న కుటుంబాల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని శ్రీరామ్ ఫైనాన్స్ తన CSR కార్యక్రమం ద్వారా విద్యకు ప్రాధాన్యత ఇస్తోంది. 2026--27 విద్యా సంవత్సరానికి భారతదేశంలో సుమారు రూ.100 కోట్లు మరియు కృష్ణా జిల్లాలో రూ.2 కోట్లతో 4000 మంది స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. విజయవాడ తూర్పు M.L..A శ్రీ గద్దె రామ్మోహన్ రావు గారు,జేఎండీ మరియు సీఓఓ శ్రీ సుదర్శన్ బి హోల్లాగారు కృష్ణా జిల్లా రవాణా కమిషనర్ ఎం. పురేంద్రగారు,అఖిల భారత మోటార్ రవాణా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వై.వి. ఈశ్వరరావు గారు కృష్ణా జిల్లా లారీ ఓనర్ ప్రెసిడెంట్ రాజా గారు శ్రీరామ్ ఫైనాన్స్ ప్రెసిడెంట్ ఎం. వెంకటేశ్వర రావుగారు,జోనల్ బిజినెస్ హెడ్ బి. గోపాలారావుగారు.

## పడ్డా..



మాటల మలుపులో మమతను కోల్పోయి జారిపడ్డా..
తలకెక్కిన గర్వం కరిగిపోయి,
నేలతల్లి ఒడిలో నిజం తెలిసి కిందపడ్డా..
చుట్టూ తిరిగే లోకాన్ని నమ్మి,
నిజమేదో నాటకమేదో తెలియక తలతిరిగిపడ్డా..
ఓటమి నీడలో ఒంటరిగా మిగిలి,
నిరాశ నిట్టూర్పులు నీరసపరచగా సోలిపడ్డా..
పెరుగుతున్న అహంకారపు మెట్లెక్కి,
గర్వపు ఎత్తుల్లోకి ఎగసి పైనపడ్డా..
మెరిసే ప్రతి దారి మంచిదనుకొని,
ముసుగేసిన మనుషుల మాటలు నమ్మి పొరపాటుపడ్డా..
కర్తవ్యపు కడలిలో కాపలా మరిచి,
కాలం పరుగును కళ్లారా చూడక కునుకులోపడ్డా..
నీడను నిజమని, నిశ్శబ్దాన్ని ప్రేమని భావించి,
మిరుమిట్ల మెరుపులనే వెలుగనుకొని భ్రమలోపడ్డా..
దారి తెలిసినా దురాశ వెంట నడిచి,
లోభపు అడుగులతో లోతులోకి జారి గోతిలోపడ్డా..
పడిన ప్రతిసారీ ఓ పాఠం నేర్చుకున్నా,
ఎన్ని గాయాలైనా నవ్వుతూ భరించా;
పడటం ఓటమి కాదని
తెలుసుకున్నా,
ప్రతిసారీ కొత్త బలంతో
లేచి నిలిచా!
కాలం వీచిన గాలికి తట్టుకోలేక,
ఆశల రెక్కలు విరిగి నేలచేరగా తూలిపడ్డా..
జీవితమనే దారిలో జాగ్రత్త తప్పి,



**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం**

## బ్రిక్స్ సదస్సు ద్వారా ప్రపంచ వేదికపై భారత్ సత్తా చాటింది

(1వ పేజీ తరువాయి)




ఏకాభిప్రాయానికి చేరుకునేందుకు భారత్ విశ్వసనీయ వేదికగా ఎదిగిందని చంద్రబాబు కొనియాడారు. అంతర్జాతీయ వేదికపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకురావడం పెరుగుతున్న భారత్ ఆర్థిక శక్తి, ప్రాధాన్యానికి నిదర్శనమని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్నీ ఆయన ప్రశంసించారు. 'ఈ కీలకమైన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రధాని మోదీకి నా అభినందనలు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారత్ గొంతు గతంలో ఎన్నడూ లేనంతగా విశ్వాసం, గౌరవంతో వినిపిస్తోందన్నారు. బ్రిక్స్ సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా అంతర్జాతీయంగా భారత్ స్థాయి మరింత పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్వో, పీఏలపై పోలీస్ స్టేషన్లో ముసుగులు ధరించిన పోలీసులతో దాడి చేయించడం దుర్మార్గం

## ఎంపీ వద్దిరాజు



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (వన్‌నేషన్): విచారణ పేరుతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పీఆర్వో మహేష్,పీఏ మహేందర్ రెడ్డిలను పండుగ రోజున సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ముసుగులు ధరించిన 15 మంది పోలీసులు దాడికి యత్నించడం దుర్మార్గమైన చర్య అని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న బీఆర్ఎస్ లీగల్ బృందం సభ్యులు ఈ దుశ్చర్యను కనిపెట్టి గట్టిగా అరవడంతో ముసుగులు ధరించిన పోలీసులు అక్కడి నుంచి పారిపోవడం జరిగిందన్నారు. ముసుగులు ధరించిన టాస్క్ ఫోర్స్ పోలీసులను పంపి మహేష్, మహేందర్ రెడ్డిలపై దాడికి పాల్పడడాన్ని ఎంపీ రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. విచారణ కొనసాగుతున్న సందర్భంలో కస్టడీలో ఉన్న వారిపై సాక్షాత్తు పోలీస్ స్టేషన్‌లోనే దాడికి దిగితే ప్రభుత్వం ఏం చేస్తున్నదని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర నిలదీశారు.

ఈ కేసులో తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశించినప్పటికీ, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా దాడికి దిగడం కోర్ట్ ధిక్కారణ కిందకే వస్తుందన్నారు. హోం శాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సంఘటనపై తక్షణమే స్పందించాలని, దాడికి యత్నించిన వారిని గుర్తించి కేసు నమోదు చేసి,కఠినంగా శిక్షించాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు.

## సెవెన్ హిల్స్ స్వాతి గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# ఘనంగా వినాయక చవితి వేడుకలు



మనసురాబాద్/వన్ నేషన్ : మనసురాబాద్ డివిజన్ పరిధి సెవెన్ హిల్స్ స్వాతి గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత 20 ఏళ్లకు పైగా నుండి ఇక్కడ వినాయక చవితి వేడుకలు ఎంతో ఐక్యమత్యంతో ఘనంగా నిర్వహించుకుంటామని అన్నారు. ఇందులో భాగంగా పూజా కార్యక్రమాలు, సంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఆ వినాయకుడి ఆశీర్వాదాలు అందరి పై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కత్తుల రాంబాబు కార్యదర్శి నీలోజు కిషోర్ బాబు, జాయింట్ సెక్రటరీ బి.మధు కోశాధికారి చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు అడ్ల ప్రవీణ్, కొరమేని వెంకటేష్, సాయి కృష్ణ, కార్యనిర్వాహక సభ్యులు ఎల్. సరస్వతి, బి. స్రవంతి, ఎం.రమేష్, జె.అజయ్, బడిని సతీష్, సి.వెంకటేశ్వర్లు, మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో ఘోర రోడ్డు ప్రమాదం







ఎమ్మిగనూరు సెప్టెంబర్ 14 MD యూసుఫ్ (వన్ నేషన్) : ఎమ్మిగనూరు పట్టణం చివరలో ఘోర రోడ్డు ప్రమాదం ఎమ్మిగనూరు ఆదోని రహదారిలో వెంకటాపురం క్రాస్ దగ్గర కారు బైకు డి బైక్ నుండి ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు తీవ్ర గాయాలు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది

## సడెన్‌గా ఫ్రేమ్‌లోకి వచ్చిన త్రిష.. ముఖం తిప్పేసుకున్న విజయ్.. వీడియో వైరల్



గత కొంతకాలంగా తమిళనాడు సినీ, రాజకీయాల్లో బాగా వినిపిస్తున్న పేరు త్రిష సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పేరు మరింత ట్రెండ్ అయింది. ప్రతిపక్ష నాయకులు సైతం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ పేరు ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. తాజాగా మరోసారి త్రిష, విజయ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. ప్రస్తుతం సీఎం విజయ్ యూకే పర్యటనలో ఉన్నారు. రేసింగ్ ఈవెంట్స్‌లో భాగంగా సినీ నటుడు అజిత్ కూడా అక్కడే ఉన్నారు. ఈ సంద ర్భంగా ఇద్దరు హీరోలు కలుసుకున్నారు. అనంతరం జరిగిన రేసింగ్ ఈవెంట్‌ను విజయ్ గ్యాలరీ నుంచి వీక్షిస్తుండగా సడెన్‌గా త్రిష మధ్యలోకి వచ్చారు. దీంతో విజయ్ కాస్త ఇబ్బందిపడ్డారు. వెంటనే తన ముఖం వీడియోలో పడకుండా పక్కకు తిప్పుకొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## .టొరంటో అంతర్జాతీయ చిత్రోత్సవంలో... దోరతి



కథానాయిక కీర్తి సురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రాధారులుగా రూపొందిన తమిళ సినిమా 'దోరతి'. కార్తిక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్, జ్యోతిదేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించారు. తాజాగా ఈ సినిమా టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం(టిఫ్)2026లో ప్రదర్శితమైనట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది చిత్రబృందం.

ప్రీమియర్ అనంతరం ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. దీంతో సినీ బృందం ఇన్‌స్టాలో 'ఈ క్షణాన్ని పంచుకోవడం మరపురానిది. ఈ చిత్రానికి జీవం పోసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అనే క్యాప్షన్‌తో ఫొటోలని పంచుకుంది. దశాబ్ద కాలంలో టిఫ్‌లో ప్రదర్శితమైన తొలి తమిళ చిత్రంగా నిలిచింది 'దోరతి'. 90ల కాలంలో చిన్ననాటి ఇద్దరు స్నేహితులు, వారికి పరిచయమైన దోరతి అనే మహిళ చుట్టూ తిరిగే కథ ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.



## కాకా.. ధూమ్ ధమాకా!

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డేమారి, నరేశ్ ప్రధాన పాత్రధారులుగా బద్రప్ప గాజుల తెరకెక్కించిన చిత్రం 'క్రేజీ కళ్యాణం'. బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్రం నుంచి పెళ్లి బరాత్ గీతాన్ని విడుదల చేశారు. "కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక" అంటూ హుషారుగా సాగిన ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. ఈశ్వర్ పెంటి నృత్యరీతులు అందించారు. ఈ పాటలో అనుపమ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి కూర్పు: శ్రావణ్ కటికనేని, ఛాయాగ్రహణం: శ్యామ్ దూపాటి.

# తిరగబడ్డ జాతి కథ... ది ప్యారడైజ్



"ఈ 18 ఏళ్లలో మానసికంగా, శారీరకంగా నేను ఎక్కువగా కష్టపడింది 'ది ప్యారడైజ్' కోసమే. ప్రచార చిత్రాల్లో హింస కనిపిస్తుందేమో కానీ, మేం దాని వెనకున్న భావోద్వేగాల్ని ప్రేక్షకులు అనుభూతి చెందాలని చేసిన ప్రయత్నమే ఈ చిత్రం" అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'ది ప్యారడైజ్'. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ముఖ్యభూమిక పోషించారు. ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. నాని మాట్లాడుతూ... "ఒక సినిమాకి ఇంత విరామం నా కెరీర్‌లో ఎప్పుడూ రాలేదు. కొన్ని అనివార్య కారణాలు, మా ప్రణాళికల్లో లోపాలు ఇందుకు కారణం కావొచ్చు. ఇదంతా మాకు ఓ అనుభవ పాఠంలా ఉపయోగపడుతుంది. అయితే మేం ఏం అనుకుని ఈ సినిమాని మొదలుపెట్టామో, దాన్ని పక్కాగా సిద్ధం చేయడంలో మాత్రం విజయవంతం అయ్యాం. ఇప్పటికే పలు బృందాలు నిద్రాహారాలు మానేసి పనిచేస్తున్నాయి. ఇప్పటివరకూ విడుదల చేసిన ప్రచార చిత్రాలకూ, పాటలకు ప్రేక్షకుల నుంచి గొప్ప స్పందన లభించింది. వాటిని సొంతం చేసుకున్న తీరు చూశాక మాపై బాధ్యత ఇంకా పెరిగిపోయింది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని పంచడం కోసం సినిమాని నాణ్యతతో సిద్ధం చేస్తున్నాం. విడుదల తేదీ దగ్గర పడుతున్న దృష్ట్యా, సినిమాని నాణ్యగా ముస్తాబు చేయడం కోసం ట్రైలర్‌ని విడుదల చేయడం లేదు. ఈ సినిమా ప్రయాణంలో జడలతో పోరాట ఘట్టాల్లో నటించడమే తాను ఎదుర్కొన్న అతి పెద్ద సవాల్. జడలు, చేతిపై పచ్చబొట్టు... ఇలా ప్రత్యేకమైన వేషధారణతో నా పాత్ర కనిపిస్తుంది. మొండి ఘటమైన దర్శకుడు శ్రీకాంత్ నిజాయతీతో కూడిన ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిందే ఆ రూపం. ఈ సినిమా ప్రయాణంతో మోహన్‌బాబులోని మరో కొత్త మనిషిని చూశా. ఆయనతో కలిసి పనిచేస్తే ప్రేమలో పడతారు. నేను ఇప్పటివరకూ చేసిన సినిమాల్ని చూస్తే నేను ట్రెండ్‌ను అనుసరించలేదనే విషయం స్పష్టం అవుతుంది. 'హిట్ 3', 'ది ప్యారడైజ్', 'బ్లడీ రోమియో' సినిమాల కారణంగా నేను ఎంచుకునే కథలపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ నా తర్వాత సినిమా ప్రకటన వస్తే అందరికీ నా ప్రయాణంపై స్పష్టత వస్తుంది. ఇప్పుడు చేస్తున్న సినిమాలకి భిన్నమైన ప్రయత్నాలతో త్వరలోనే తిరిగొస్తా" అన్నారు.

ఇది మా సినిమా అనడం కంటే కూడా, జనం సినిమా అనడమే సరైనదనీ.. ఇందులోని పాటల్ని, ప్రచార చిత్రాల్నీ అంతగా సొంతం చేసుకున్నారన్నారు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. "తిరుగుబాటుతో కూడిన భావోద్వేగ ప్రధానమైన సినిమా ఇది. ఒక సవారీ జాతి కథ. 'పుట్టుక మనది, చావు మనది, బతుకంతా దేశానిది' అనేది కాళోజీ మాట. అలా దేశం కోసం కొట్లాడిన వాళ్లని ఈ దేశంతోనే సంబంధం లేదన్నప్పుడు.. ఏం చేయాలో తెలియక తిరుగుబాటు చేస్తారు. వాళ్ల కథే ఇది. ఇందులో భావోద్వేగాలే ప్రధానం" అన్నారు శ్రీకాంత్ ఓదెల. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ "ఈ నిర్మాణ వ్యయం అంచనాల్ని మించినా నేను సంతోషంగానే ఉన్నా. ముందస్తు ప్రదర్శనలు ఉంటాయి. టిక్కెట్ ధరల విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు" అన్నారు.



## రామ్‌తో సంయుక్త

రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందిస్తున్నారు. కృష్ణ పోతినేని నిర్మాత. ఇందులో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇదో విభిన్నమైన నియో-నోయిర్ సైకలాజికల్ థ్రిల్లర్. రామ్ ఇందులో వీర అనే శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో అలరించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సామ్ సీఎస్ సంగీతమందిస్తుండగా.. తిరునావుక్కరసు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక మరోవైపు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా 'స్వయంభూ', 'స్లమ్ డాగ్', 'హైందవ', 'ది బ్లాక్ గోల్డ్' చిత్ర బృందాలు ఆమె కొత్త ప్రచార చిత్రాలు విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపాయి.

## ఆ మార్పునకు సిద్ధంగా ఉన్నా!



"బిడ్డ పుట్టడం వల్ల జీవితం మారిపోతుందని అందరూ చెబుతారు. నేను ఆ మార్పుని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాన"ని అంటోంది కథానాయిక సమంత. ఇటీవలే 'మా ఇంటి బంగారం' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆమె.. త్వరలో తల్లి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సమంత తన జీవితంలోని కొత్త దశ గురించి ఆసక్తికరమైన సంగతుల్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. "తస్సాదియ్యా' పాట చిత్రీకరణలో గర్భవతినని తెలిసింది. ఆ సమయంలో కొంచెం అనారోగ్యంగా ఉన్నప్పటికీ చిత్రీకరణని కొనసాగించాం. ఇప్పుడా సందర్భాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నా సహజంగానే కుదిరినట్లు అనిపిస్తుంది. బిడ్డ పుట్టడం 'మీ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది' అని అందరూ చెప్పే మాటను నేను నిజంగా నమ్ముతాను. దానిని ఆస్వాదించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. వృత్తి పరంగా కొంత కాలం విరామం తీసుకున్నప్పటికీ నా శరీరం చెప్పే దానిపైనే దృష్టి పెడతాను. బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకోవడం లేదు. మా నిర్మాణ సంస్థలో కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తూ.. మరెన్నో చిత్రాలు రాబోతున్నాయి. వాటికి అవసరమైన సమయాన్ని కేటాయిస్తూనే అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటాను. భవిష్యత్తులో కూడా బలమైన మహిళా ప్రాధాన్య పాత్రలు కలిగిన చిత్రాలొస్తాయి" అని చెప్పింది.

## మోహిని నుంచి.. ఓ చిన్న రిక్వెస్ట్

వదిన... ఒక స్వచ్ఛమైన, కల్తీ లేని వందశాతం అసలైన హారర్ సినిమా రకం మంత్రగత్తె' అంటూ కుటుంబం మొత్తాన్ని కూర్చోబెట్టి.. తన వదిన ఎలాంటిదో చెప్పి నమ్మించాలని ప్రయత్నిస్తున్నాడో వ్యక్తి. మరి అతను చెప్పేది నిజమేనా? అందరూ అది నమ్మారో లేదో తెలియాలంటే 'నయీ నవేలి' సినిమా చూడాల్సిందే. యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రమిది. బాలాజీ మోహన్ దర్శకత్వంలో ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దసరా పండగ సందర్భంగా అక్టోబరు 16న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం 'లేడీస్ అండ్ జెంటిల్‌మెన్.. మోహిని నుంచి ఒక చిన్న రిక్వెస్ట్' అనే వ్యాఖ్యలతో తాజాగా ఈ చిత్ర అధికారిక టీజర్‌ను ఇన్‌స్టాలో విడుదల చేసింది. ఇందులో 'మంత్రగత్తెనా? అంతేనా? ఇద్దరు మంత్రగత్తెలు, ముగ్గురు రాక్షసులు, నాలుగు దెయ్యాలని అల్పాహారంగా తింటాను.. లేడీస్ అండ్ జెంటిల్‌మెన్ థింక్ బిగ్' అంటూ యామీ చెప్పిన డైలాగులు, సరికొత్త అవతారంలో భయపెట్టిన తీరు ఆసక్తిని రేకెత్తించాయి. ఈ చిత్రంలో ఒక సాధారణ కుటుంబ ప్రపంచాన్ని తలకిందులు చేసే కోడలు మోహిని పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది యామి.



Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**